భర్త శయనేషు మన్మథుడిలా లేడని అలిగివచ్చిన కూతుర్ని ఆమె ఎలా నచ్చచెప్పింది?

# పోయిరాతల్లీ పోయిరామ్మా

సిహెచ్. కామేశ్వరి కథ

“అమ్మా వెళ్ళొస్తానమ్మా” అని అంటూ రిక్షా ఎక్కింది సుమతి.


“మంచిదమ్మా మీ ఆయన్ని, పిల్లల్ని అడిగినట్లు చెప్పు, వెళ్ళగానే ఉత్తరం రాయి” అంది సీతమ్మ కొంచెం దిగులుగా.

“అలాగేనమ్మా నీ ఆరోగ్యం జాగ్రత్త” అని చెప్తూ ఉండగానే రిక్షా కదిలింది. కనిపించినంత మేర వరకు వెడుతున్న రిక్షాని చూసి ఆ తర్వాత యింట్లోకి వచ్చి, చాపమీద నడుం వాల్చింది సీతమ్మ.

ఆమెకి కూతరు వెళ్ళిందన్న బెంగకన్నా, కూతురు తెచ్చిపెట్టిన సమస్య పెద్దదవకుండా తొలగిపోయిందన్న ఆనందం ఎక్కువగా ఉంది సీతమ్మకి.

“లేకపోతే యిద్దరు పిల్లల తల్లి, పెళ్ళయిన పదకొండేళ్ళకి, మొగుడ్ని వదిలేస్తానని, పుట్టింటికి వచ్చి కూర్చుంటే, “ఏ తల్లికయినా ఎంత మనోవ్యథ?! నిజంగా సుమతి మనసు మార్చుకొని తన యింటికి తాను వెళ్ళింది” కాబట్టి సరిపోయింది.

లేకపోతే ‘హరేరామ హరేకృష్ణ’ అనుకోవాల్సిన వయసులో ‘అయ్యో రామచంద్రా’ అని తల్లడిల్లవలసి వచ్చేది. అసలు ఈ కాలం పిల్లలే అలా ఉన్నారు. యిలా వయసులోకి అడుగిడుతున్నారో లేదో, అలా తమ బాగోగుల గురించి, మంచి ప్రణాళికలు వేసుకోవడం, యిల్లు పొలాలు వంటి స్థిరాస్థులు అమర్చుకోవడం చూస్తే ముచ్చటగా ఉంటోంది. కాని తోడబుట్టిన వాళ్ళపై ప్రేమాభిమానాలు చూపడంలో కాని, వారి కష్టసుఖాలు పట్టించుకొని, వాటిలో పాలు పంచుకోవడంలోకాని ఏ రకమయిన తోడ్పాటుగానూ



ఉండటంలేదు.

తన యిద్దరు కొడుకులు మంచి మంచి ఉద్యోగాల్లో స్థిరపడ్డారు. యిళ్ళు కట్టుకొన్నారు. పిల్లా పాపలతో కులాసాగా ఉన్నారు.

తనని వాళ్ళవద్ద ఉండమని బ్రతిమాలినా, తనకి ఈ పరిసరాలతో ముడిపడి ఉన్న అనుబంధాలని వదులుకోలేక యిక్కడి నుండి రాలేనని నిష్కర్షగా చెప్పింది.

తన కూతురు సుమతి గురించి కూడా ఏం బెంగా లేకుండా నిశ్చింతగా ఉంది. అటువంటిది నాల్గు రోజుల క్రితం అకస్మాత్తుగా ఒంటరిగా వచ్చిన సుమతిని చూసి విస్తుపోయింది తను.

తన యక్ష ప్రశ్నలన్నింటికి నోటికొచ్చిన సమాధానాలు చెప్పిన సుమతి, చివరికి నిన్న తన మనసులోని మాట చెప్పేసరికి ఒక్కసారిగా గుండె ఆగినంత పనయింది తనకి.

తనకు తెల్సున్నంతవరకు తమ అల్లుడు శేఖరం బుద్ధిమంతుడు పైగా శ్రీరామచంద్రునిలాంటి ఏకపత్నీవ్రతుడు.

సుమతి అన్నా, పిల్లలన్నా పంచ ప్రాణాలు. అలాంటి అల్లుడ్నించి కూతురు ఎందుకు విడిపోవాల్సి వస్తోందో అని గదమాయించి అడిగితే, సుమతి చెప్పిన మాటలు వింటే నవ్వాలో ఏడ్వాలో అర్థం కాలేదు తనకి.

పెళ్ళయిన యిన్నాళ్ళకి భర్తంటే విముఖత కల్గిందని, ఆ భర్తతో ఉండనని ఏ ఆడపిల్లయినా పుట్టింటికి వస్తుందా?'' ఒక వేళ వచ్చినా, ఎవరయినా సమర్ధిస్తారా? పిచ్చి పిచ్చిగా మాట్లాడకుండా నీ యింటికి నోర్మూసుకొని పొమ్మని తిట్టి పోసింది తను.

''గుడ్డిలో మెల్ల'' అన్నట్లు ఈ విషయం యింతవరకు ఎవరిదగ్గరా ప్రస్తావించలేదట. తల్లి కాబట్టి తనతోనే ఈ విషయం చెప్పిందిట. ఆ మాట విన్నాక మనసు కొంచెం నెమ్మదించింది. సుమతి మొదటి నుంచి చాలా శుచి శుభ్రతలు కలిగిన పిల్ల యిల్లు ఒళ్ళు నీటుగా ఉంచుకోవడమే ఆమె దిన చర్య బట్ట నలగకుండా జుత్తు చెదరనీయకుండా ఎప్పుడూ కడిగిన ముత్యంలా వుంటుంది. దానికున్న మంచి అలవాట్లని చూసి యింటిల్లిపాదీ తెగ మురిసి పోయేవారుఫ అత్తింట్లో కూడా అందరి మెప్పు సంపాదించింది. పిల్లల్ని కూడా ముద్దొచ్చేలా తయారుచేసేది.

తన అల్లుడు శేఖరం కొంచెం బద్ధకస్తుడని మొదట్నుండీ వ్యవసాయంలో ఉండటంవలన మొరటుగా కూడా ఉంటాడని అనుకోవడం తప్ప అతని గురించి ఎక్కువగా తెలీదు సుమతి చెప్పేంతవరకు అతనెంత అనాగరికంగా ఉంటాడో తనకీ తెలియలేదు.

అదే సుమతికి అతని మీద కలిగిన విముఖతకి, ఏవగింపుకి కారణమని సుమతి గోల, అయితే మాత్రం ఓ కాపురాన్ని వదులుకుంటానంటే ఎట్లా? అతనికి వేసుకొనే బట్టల మీద కాని, దువ్వుకునే క్రాఫ్ మీద కాని ఏ మాత్రం శ్రద్ధ లేదుట, నోరు విప్పితే పూత పదాలు లేందే మాట్లాడడుట. అది చూసి అందరూ అతన్ని వేళాకోళాలు పట్టిస్తారట. అంతేకాక ఎన్నో చికాకుపర్చే లక్షణాలున్నాయట. వాటితో చిరాకెత్తిపోతోందట సుమతి!

ఎండలో తిర్గితిర్గి వస్తాడట. రాగానే ఆ కాళ్ళతోనే మంచంపై ఎక్కి ఫ్యాన్‌గాలికి ఒళ్ళు ఆరబెట్టుకొంటాడట. కాని సుమతి ఎంతపోరినా రెండో పూట స్నానం చేయడు. అస్తవ్యస్తంగా లుంగీ చుట్టబెట్టుకొని పైన బనీనయినా వేసుకోకుండా తిరుగుతాడట.


ఎలా అలవాటయిందో చుట్ట అలవాటయిందట. యింట్లో సుమతి అరుస్తోందని బైట కాల్చుకొస్తాడుట. కానీ అతను

దగ్గరికి రాగానే సుమతికి డోకొచ్చినంత పని అవుతోందిట.

సుమతి నాగరికతని శుచిశుభ్రతలని మెచ్చుకునే వారందరూ శేఖరం అనాగరికతను అశుభ్రతను బాహాటంగా విమర్శిస్తూ వెక్కిరిస్తుంటే సుమతికి ప్రాణసంకటంగా వుంటోందట.

దాని మాటలకి విస్తుపోతో, ''మరి పెళ్ళయినప్పటి నుండి ఎలా భరించావే''! అని అంటే.

''మొదట్లో మరీ యింత ఎడ్డితనం లేదు. ఈ మధ్య మరీ ఎక్కువయిపోయింది. ఏమయినా అంటే వచ్చే వయసా? పోయే వయసా? అనడం, వలభయ్యేళ్ళకే ఎనభయ్యేళ్ళ ముసలాడిలా మాట్లాడుతోంటే చిర్రెత్తుకొస్తోంది నాకు. నీట్‌గా గెడ్డం గీసుకోరు, కాస్త ఖాళీగా ఉంటే చాలు గోళ్ళు కొరుక్కోవడం, చెవుల్లో వేళ్ళు పెట్టుకోవడం... ఏమయినా విసుక్కుంటే రాజుని మూసిన కళ్ళతో మొగుడ్ని చూస్తే నచ్చుతాడా? అని చెప్పటం... అంతేగాని, ఆయన మాత్రం మారటం లేదు. మగాళ్ళకి పెళ్ళాం మాత్రం 'శయనేషు రంభా' అన్నట్లు కావాలి, కాని, మగాడు భార్యకి 'శయనేషు మన్మధుడిలా' ఉండనక్కరలేదా?'' అసలు యిలాంటి వాళ్ళని చూసే కాబోలు పండుగనాడూ పాత మొగుడేనా?' అన్న సామెతలు పుట్టుంటాయి. నేనేమో తెల్లచీరా జాకెట్టు కట్టుకొని తల్లో పూలు పెట్టుకొని మల్లెపూవులాంటి పక్కవేసి సుగంధ శృంగార అగరబత్తి వెలిగించుకొని నా బెడ్‌రూమ్‌ని అందంగా అలంకరించుకొని ఆయనకై ఎదురుచూస్తుంటాను. నా వలన ఆయనకి కలిగే సుఖాలకి కొదవ లేదు కాని నాకు మాత్రం జుగుప్స మిగులుతోంది. అది భరించలేక ఏవో సాకుతో ఆయనకి దూరమయినా అవుతున్నాను లేదా బలవంతంగా శరీరాన్ని అయినా అప్పచెప్తున్నాను తప్పితే నాలో మానసిక స్పందన వచ్చి



పోతోంది. ఈ బాధ భరించలేకే నీకు చెప్పుకొంటున్నాను'' అన్న సుమతి మాటల్లో నిజం వుంది. బాధ వుంది. కానీ కాపురాన్ని కూలదోసుకోమ్మని ఎలా చెప్తుంది?''

అందుకే కూతుర్ని ''మీ నాన్న ఎలాంటివారు?'' అనడిగింది తను. తన ప్రశ్న వినగానే తన మొహంలోకి ఆశ్చర్యంగా చూస్తూ తన ప్రశ్న వినగానే తన మొహంలోకి ఆశ్చర్యంగా చూస్తూ 'అదేమిటమ్మా అలా అడుగుతావు?' నాన్న గారికేం?'' ఆయనలో వున్న మంచి లక్షణాలు ఎవరికున్నాయి?'' అనడిగింది తీవ్రంగా, తన కూతురు నాన్న కూచి మరి''.

దానికి తాను విషాదంగా ఓ నవ్వునవ్వి 'పిచ్చి తల్లీ లోకంలో ఏమగాడయినా, మంచి తండ్రి, మంచి కొడుకు, మంచి వ్యక్తి అనిపించుకోగలడు. కాని, మంచి భర్త అనిపించుకోగల మగవాళ్ళు చాలా కొద్దిమంది మాత్రమేనమ్మా!

అలాగే మీ నాన్నగారు నీకు మంచి తండ్రే కాని, నాకు మాత్రం మంచి భర్తకారు'' అంది జ్ఞాపకాలు తిరగేసిన వ్యధలో తాను!

మీ నాన్నకి ఉన్న నీట్‌నెస్ మంచి అభిరుచులే నీకు తెలుసు కాని ఆయనకున్న చలపబుద్ధులు నీకు తెలీదు.

నీకన్నా ఎక్కువగానే తయారయ మీనాన్నకై ఎదురుచూసేనమ్మ ఏ అర్ధరాత్రో తాగివచ్చి సిగరెట్ బ్రాందీ జర్దా పాన్ కలగలసిన వెగటు వాసనలలో నా ప్రమేయం లేకుండా ఆయన కోర్కెలు తీర్చుకున్న రోజులున్నాయి.

అంతేకాదు నాదనుకున్న బెడ్‌రూమ్‌లో నా మంచంపై మన పని మనుషులతోనూ, వంటావిడతో, డబ్బుతో కొని తెచ్చుకున్న వారెందరితోనో, ఆయనకు అక్రమ సంబంధాలు వున్నాయి. ఎవరెవరి ద్వారానో అంటించుకొన్న సుఖ రోగాలు ముదిరి కొన్నాళ్ళు నీ నాన్న ఆరోగ్యాన్ని పాడుచేసి పెట్టాయి. ఆయనని బట్టి నాకూ అంటుకొని నీకన్నా ముందు పిల్లాడు కడుపులోనే పోతే, అప్పటి నుండి కనువిప్పు కలిగి ఆ చెడు తిరుగుళ్ళు మానారు. యివన్నీ నీకు తెలుసా?

అప్పట్లో నాకు బ్రతకాలన్న ఆశ కూడా నశించి, 'పిల్లల్ని చంపి నేను కూడా ఛస్తే మంచిది' అనిపించేది కాని, మీ బామ్మ అమ్మమ్మలకిచ్చిన, మాటకోసం బ్రతికి మీ నాన్నలోని మార్పుని చూసాను. నా విలువ ఏమిటో తెలియచేయగలిగాను. 'యిప్పుడు చెప్పు నాకంటే హేయమయిన పరిస్థితులా నీవి'' అని ప్రశ్నించిన తన ప్రశ్నకి బదులుగా 'అది కాదమ్మా మీ అల్లుడికలాంటి దురలవాట్లు లేవు కాని', అని నసుగుతున్న సుమతి వాలకం పసిగట్టి తను కొంచెం గట్టిగా మాట్లాడింది.

''యింకా కానీలు, అర్ధణాలు ఏమీలేవు సమస్యలు అనుకొంటే ఒకో దాంపత్యంలో ఒకో సమస్య ఉంటుంది. వాటితో పోరాడుతూ ఉండాలి, భరిస్తూ ఉండాలి. అదే జీవితమంటే, అంతేకాని యిలాంటి చిన్న విషయాలకి భార్యాభర్తలు విడిపోతే మాత్రం పరిష్కారం లభిస్తుందా!

"మనశ్శాంతి ఉంటుందా?" ఉన్న భర్తకి పిల్లలకీ దూరమయి, నువ్వెంత శుభ్రంగా శరీరాన్ని ఉంచుకొంటే మాత్రం ఏం లాభం?" ఆస్వాదనలు అనుభూతులు లేని అందం ఉంటేనేం? లేకపోతేనేం?" అయినా నీకో సలహా యిస్తాను అది ఆచరణలో పెట్టి చూడు తప్పకుండా శేఖరం మారుతాడు. ఎంత భార్య మాట వినని మగవాడయినా పడగ్గదిలో మంచిగా చెప్తే దారికొస్తాడు.

అతను నీట్‌గా ఉంటే తప్ప నీకు మూడ్ రావటం లేదని సరసంగా చెప్పి చూడు. అతను నీ మాటవిన్న రోజున అతనికి అన్ని విధాల సుఖాన్నందించి, మెల్లిగా నీ మార్గానికి మార్చుకో. అంతేకానీ రోజు రోజుకి ఏవగింపు పెంచుకొని, అతనికి దూరమయి నీ మనశ్శాంతిని పోగొట్టుకొని ఆత్మహత్యకు పాల్పడి మా అందరి గుండెల్లో చిచ్చుపెట్టకు.

నీ పిల్లలు కూడా పెద్దవాళ్ళు అవుతున్నారు. ఎప్పుడో వాళ్ళు కూడా తండ్రిని 'ఏంటి నాన్నగారు మీరిలా వుంటారు?' అని అడుగుతారు? అప్పుడయినా మీ ఆయన మారకపోడు "యిలా అనేక విధాలుగా నచ్చ చెప్పి సుమతి మనసు మార్చగల్గింది. ఏదో దేముని దయవలన ఆ మాటలన్నీ తలకెక్కాయేమో" ఈ రోజు ప్రయాణమై వెళ్ళింది.

లేకపోతే తనకి ఈ పిల్ల జీవితం గురించి ఎంత ఆందోళన పడవలసి వచ్చేది? అని అనుకుంటూ యధాలాపంగా గోడపైన తగిలించిన భర్త ఫోటో వైపు నీళ్ళు నిండిన కళ్ళతో క్షమించమన్నట్లు చూసింది.

ఫోటోలో భర్త తలపంకించి, చిరునవ్వుతో 'పిచ్చిదానా!' అన్నట్టు కన్పించిందామెకి! తృప్తిగా చెమర్చిన కళ్ళను మూసుకొంది సీతమ్మ? ఆ మాతృ హృదయం అప్పటికి చల్లబడింది!!



## లడ్డూ

రామా పనిమనిషితో సరసాలాడుతూ వుండగా తన ఐదేళ్ళ పుత్రుడు అప్పుడే కాన్వెంట్‌నుంచి వచ్చాడు.

ఒరేయ్ నానీ ఈ విషయం అమ్మతో చెప్పకు నీకు చాక్లెటు కొనిపెడతాను. కొడుకుని బ్రతిమాలాడు రామా.

ఒక్క చాక్లెటేనా! అమ్మ అయితే ఇలాంటివి చెప్పకుండా ఉండటానికి నాకు లడ్డూలు యిస్తుంది తెలుసా! అన్నాడు నానిగాడు.

– గీతా శ్రీనివాస్ (గండిపాలెం)